వరి సాగులో కాలిబాట.. లాభాల పంట

- పంట ఎదుగుదల, అధిక దిగుబడికి దోహదం
- దుబ్బుకు ధారాళంగా గాలి, వెలుతురు
- పైరుపై తెగుళ్ల దాడి తగ్గుముఖం



దిరుసుమర్రులో వరి పొలంలో కాలిబాటలు వేసిన దృశ్యం

భీమవరం అర్బన్: దాళ్వా వరి పంటలో కాలి బాటలు వేయడం ద్వారా అధిక దిగుబడి రావడమే కాకుండా పంటపై తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలకు అవకాశం ఉంటుంది. భీమవరం మండలంలో యనమదుర్రు, దిరుసుమర్రు, తాడేరు, బేతపూడి, రాయలం, చినఅమిరం, కొమరాడ తదితర గ్రామాల్లో సుమారు 8,400 ఎకరాల్లో దాళ్వా వరి సాగుకు శ్రీకారం చుట్టారు. ఇప్పటి వరకు 70 శాతం వరినాట్లు పూర్తయ్యాయి. సాగులో రైతులకు మెలకువలు తెలియకపోవడంతో ఆ ప్రభావం దిగుబడిపై పడుతుంది. కొందరు రైతులు రబీలో కాలి బాటలు వేయడం వృథా ఖర్చుగా భావించి వెనుకడుగు వేయడం, వరినారు దొరకకపోతే వెదజల్లే పద్ధతి అనుసరించడం, సాగులో యాంత్రీకరణ వినియోగించడం, భూసార పరీక్షలు ద్వారా మందులు వాడటం వంటి విధానాలను అమలు చేయడం వల్ల ఖర్చు తగ్గడమే కాకుండా సమయం ఆదా అవుతుంది. అంతేకాకుండా అధిక దిగుబడి సాధించవచ్చు. పొలంలో కాలిబాటలు వేయడానికి ఎకరానికి రూ. 800 ఖర్చయితే రెండు నుంచి నాలుగు బస్తాల దిగుబడిని అదనంగా పొందవచ్చనంటున్నారు. కాలిబాటలు వేసుకునే విధానం, లాభాలపై భీమవరం మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ పలు సూచనలు చేశారు.

కాలి బాటలు వేసే విధానం

పొలంలో గట్ల పక్క నుంచి ఒక అడుగు ఖాళీ ఉండేలా చూసుకుని కాలి బాటలు వేయాలి. ప్రతి రెండు మీటర్లకు ఒక కాలి బాట పడేలా చూడాలి.

ఉపయోగాలు

కాలి బాటల వల్ల వరి మొదళ్లకు గాలి, వెలుతురు బాగా తగిలి చీడపీడలు త్వరగా ఆశించవు. బాటలకు ఇరు వైపులా ఉన్న కుదుర్లు అధికంగా దుబ్బు చేస్తుంది. బాటలు వెంబడి నడుస్తూ పంట తెగుళ్ల గుర్తించేందుకు కలుపు మొక్కలు ఏరి వేయడానికి వీలుగా ఉంటుంది. రసాయనిక ఎరువులు సమర్థవంతంగా వేసుకోవచ్చు. చీడపీడలకు, సస్యరక్షణ చేయాల్సిన అవసరముంటే ముందుగా తెగులు సోకిన చోట మందులను పిచికారీ చేసి తదుపరి మిగిలిన చోట చేయవచ్చు. బాటలు వెంబడి ఎలుకల నివారణ చర్యలు చేపట్టడానికి వీలవుతుంది. ప్రతి రోజు పొలంలో వరి పంటను సమగ్రంగా పరిశీలించవచ్చు. బాటలు పక్కన ఉన్న దుబ్బులు మూడు, నాలుగు పిలకలు అధికంగా చేయడంతో పాటు, ఆటలు వెంబడి తీసిన మూనలు ఖాళీ స్థలంలో ఊడ్చడం వల్ల ఎకరానికి 150 నుంచి 350 కిలోల వరకు దిగుబడిని అదనంగా పొందవచ్చు.

వేరు బలపడక ముందే



నాటిన వరి దుబ్బు వేరు బలపడకముందే పొలంలో కాలి బాటలు వేసుకోవాలి. దానివల్ల పని సులువుగా అవుతుంది. మారు నాటిన మొక్క చనిపోకుండా ఉంటుంది. కాలి బాటలలో తీసిన మొక్కలను మూనలు తక్కువగా ఉన్నచోట నాటుకోవాలి. పొలంలో గాలి, వెలుతురు ప్రసరణ సక్రమంగా జరిగి పంటపై తెగుళ్ల దాడి తగ్గుతాయి. – నిమ్మల శ్రీనివాస్, వ్యవసాయాధికారి, భీమవరం మండలం

క్లుప్తంగా

ఆర్టీసీలో డ్రైవర్ల పాత్ర కీలకం



భీమవరంలో ఆర్టీసీ డ్రైవర్లను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ భీమవరం డిపో ఆధ్వర్యంలో శుక్రవారం డ్రైవర్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. బస్టాండ్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ పీఎస్‌వీఎం సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఆర్టీసీ వ్యవస్థలో డ్రైవర్ల పాత్ర చాలా కీలకమైనదని ప్రయాణికుల క్షేమమే ధ్యేయంగా పని చేస్తుంటారన్నారు. అనంతరం ఎంపిక చేసిన 10 మంది ఉత్తమ డ్రైవర్లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సురేష్, చెరుకువాడ రంగసాయి పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

భీమవరం: భీమవరంలోని విష్ణు ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉందని యువత అనేక రంగాల్లో రాణించాలన్నారు. ప్రమాదాలకు, మరణాలకు ప్రధాన కారణం అతివేగం, హెల్మెట్ ధరించకపోవడమేనని అందువల్ల వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. అనంతరం విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణాశాఖాధికారి టి ఉమామహేశ్వరావు, కళాశాల వైస్ ప్రిన్సిపల్ పి వెంకటరమరాజు, పి గిరీష్ కుమార్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థినుల కరాటే ప్రదర్శన

భీమవరం: జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మహిళా అభివృద్ధి, సంక్షేమశాఖ ఆధ్వర్యంలో భీమవరం పట్టణంలోని ఝాన్సీలక్ష్మీబాయి(జేఎల్‌బీ) మునిసిపల్ పాఠశాలలో శుక్రవారం కరాటే ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి ఈ నారాయణ మాట్లాడుతూ ఆడపిల్లలకు అందరూ అండగా ఉండాలన్నారు. అనంతరం శ్రీకాకతీయ మెరిట్ స్కూల్ విద్యార్థులు పుట్టా అక్షయ, మేరీ హెబ్సిబా, దుర్గా వర్షిణి, హర్షిత, అలేఖ్య, శశి ప్రియాంక నేతృత్వంలోని కరాటే ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుజాత, జిల్లా బాలల సంరక్షణ అధికారి రాజేష్, స్కూల్ హెచ్‌ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

మునిసిపల్ స్కూల్‌కు మైక్ సెట్ బహూకరణ

భీమవరం: విద్యాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. పట్టణంలోని మహాత్మాగాంధీ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో 140 మంది విద్యార్థులకు తాడికొండ కోటేశ్వరరావు, పెరుమాళ్ల వెంకటరమణయ్య, భవాని దంపతుల సహకారంతో కొనుగోలు చేసిన మైక్‌సెట్‌ను ఎమ్మెల్యే సమక్షంలో పాఠశాలకు అందజేశారు. గ్రంధి కుమారవెంకటేశ్వర వరప్రసాద్, పెనుమత్స రామ్మోహనవర్మ, స్కూల్ హెచ్‌ఎం షేక్ బాబాజీ సాహెబ్, మాజీ కౌన్సిలర్ మాగాపు ప్రసాద్, సయ్యద్ ఖాజా మొహిద్దీన్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధం పర్యావరణ హితం

భీమవరం: ప్లాస్టిక్ నిషేధం వల్ల పర్యావరణ హితంతో పాటు జీవవైవిధ్యం, ఆరోగ్యం వంటి ప్రయోజనాలు కలుగుతాయని జిల్లా రెవెన్యూ అధికారి మొగలి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం భీమవరంలో ప్లాస్టిక్ వాడకం నిర్మూలిద్దాం పర్యావరణాన్ని కాపాడుకుందామంటూ మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో తిరుమల స్కూలు విద్యార్థులతో ర్యాలీ నుద్దేశించి ఆయన మాట్లాడారు. ముందుగా ర్యాలీని జెండా ఊపి ప్రారంభించి అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భీమవరంలో క్యారీ బ్యాగులు, డిస్పోజబుల్ టీ కప్పులు, ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి పూర్తిగా నిషేధిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వరరావు, చెరుకువాడ రంగసాయి పాల్గొన్నారు.

ర్యాలీలో ప్లాస్టిక్ బ్యానర్ల వినియోగం

జిల్లా వ్యాప్తంగా ప్లాస్టిక్ నిషేధమంటూ ప్రచారం చేస్తున్న అధికారులే ప్లాస్టిక్ బ్యానర్లతో ర్యాలీ చేయడం విమర్శలకు దారితీస్తోంది. ప్లాస్టిక్ నిషేధంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు శుక్రవారం పట్టణంలోని విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ప్లాస్టిక్ బ్యానర్ల వినియోగించడంపై విమర్శలు వస్తున్నాయి.

ఈ-క్రాప్ నమోదు వేగవంతం

ఆకివీడు: రబీ నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని నియోజకవర్గంలో 80 శాతానికి పైగా నాట్లు పూర్తి అయినట్లు ఏడీఏ కె.శ్రీనివాసరావు చెప్పారు. స్థానిక ఏడీఏ కార్యాలయం వద్ద మూడు మండలాల స్థాయి రైతు సేవా కేంద్రాల వీఏఏలతో సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో మండల వ్యసాయాధికారిణిలు ప్రియాంక, సంధ్య పాల్గొన్నారు.

3న అప్రెంటీస్ మేళా

ఉండి: వచ్చే నెల 3వ తేదీ సోమవారం ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారంలోని ప్రభుత్వం ఐటీఐలో నిర్వహించే అప్రెంటీస్ మేళాకు ఐటీఐ ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, వెల్డర్ ట్రేడుల్లో ఉత్తీర్ణులైన వారు హాజరు కావాలని ఐటీఐ ప్రధానాధికారి, జిల్లా కన్వీనర్ వి శ్రీనివాసరాజు తెలిపారు. 3వ తేదీ ఉదయం 10 గంటలకు తణుకులోని అక్కమాంబ టెక్స్‌టైల్స్ ఆధ్వర్యంలో ఐటీఐలో నిర్వహించే అప్రెంటీషిప్ మేళా జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ఫిట్టర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్స్ ట్రేడుల్లో ఉత్తీర్ణులైన వారు మాత్రమే అర్హులని అన్నారు. అభ్యర్థులు నేరుగా ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఎన్నార్పీ అగ్రహారం ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించే అప్రెంటిషిప్ మేళాకు నేరుగా హాజరుకావాలని తెలిపారు. వివరాలకు 9676099988, 8886339666 నంబర్లలో సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

యువకుడిని రక్షించిన అగ్నిమాపక దళం

భీమవరం: పట్టణంలోని యనమదుర్రు కాలువలో శుక్రవారం నక్కా రాజేష్ అనే యువకుడు దూకి ఆత్మహత్యకు యత్నించాడు. సమాచారం అందుకున్న ఏడీఎఫ్ఓ సీహెచ్ సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో సిబ్బంది అతడిని తాడు సహాయంతో రక్షించారు. పోలీసుల సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించారు.

ఇన్‌చార్జిల పాలనతో అన్నీ ఇక్కట్లే



స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కారారి జయలక్ష్మి

ఆకివీడు: మండలంలోని వివిధ మండల స్థాయి అధికార పోస్టులు, కార్యదర్శులు, వీఆర్వో పోస్టులు ఖాళీలుండటంతో ఇన్‌చార్జిలతోనే ఆయా శాఖల అధికారుల పనులు కొనసాగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఎంపీపీ కారారి జయలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ హాలులో శుక్రవారం సర్వ సభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో వ్యవహరించి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. తొలుత సమీక్ష సమావేశంలో తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మండల స్థాయిలో పలు శాఖల అధికారుల పోస్టులు ఖాళీగా ఉండటంతో పనులు వేగంగా జరగడం లేదన్నారు. ఇన్‌చార్జిల పాలనతో అధికారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఎంపీడీఓ సహాసిని మాట్లాడుతూ ఇన్‌చార్జిలతోనే చాలా డిపార్టుమెంట్లు పనిచేస్తున్నాయన్నారు. రెగ్యులర్‌గా ఉన్న ఆయా శాఖల అధికారులు బదిలీ కావడంతో వారి స్థానంలో కొత్తవారు రాలేదన్నారు. దీనివల్ల ఇన్‌చార్జిలను నియమించాల్సి వచ్చిందన్నారు. ఈఓపీఆర్‌డీ మాట్లాడుతూ ప్రతి గ్రామంలోని మంచినీటి చెరువులను పూర్తిగా నీటితో నింపుకోవాలన్నారు.

సచివాలయ వ్యవస్థను కుదించేందుకు కసరత్తు

సచివాలయ వ్యవస్థను కుదించి, ఆరుగురు ఉద్యోగులు ఉండే విధంగా ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. ముఖ్యమైన శాఖలకు మాత్రమే సచివాలయ సిబ్బంది ఉంటారన్నారు. సమావేశంలో పలు సమస్యలపై ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మాట్లాడారు. సమావేశంలో సూపరింటిండెంట్ శ్రీకర్, పంచాయతీరాజ్ ఏఈ రమణమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నకుమారి, ఏఓ ప్రియాంక, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కిల్లి రామకృష్ణ, సైదాల సూర్యనారాయణ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

కూలీలందరికీ ఉపాధి హామీ పని చూపించాలి



ప్రాతళ్ల మెరక గ్రామంలో కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

కాళ్ల: పనులు లేక ఇబ్బంది పడుతున్న కూలీలందరికీ ఉపాధి హామీ పని చూపించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, సీఐటీయూ మండల అధ్యక్షుడు గొర్ల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ దళిత వాడలో సమస్యలపై సర్వే చేయాలని ఇచ్చిన పిలుపులో భాగంగా కాళ్ల మండలం పాతాళ మెరక దళిత పేటలో శుక్రవారం సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో ప్రధానంగా పనులు లేక చాలా ఇబ్బందులు పడుతున్నట్లు పలువురు సర్వేలో తెలిపారు. పని దినాలు వంద రోజులు అని చట్టం చెబుతున్నా 30 నుంచి 40 రోజులు మించి పనులు చూపటం లేదని పలువురు అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉపాధి హామీ పనులు వెంటనే కల్పించాలని లేని పక్షంలో భృతి ఇవ్వాలని సత్యనారాయణ కోరారు. పని దినాలను 150 రోజులకు పెంచాలని, కనీస వేతనం రూ.400 ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు తిరుమాని శ్రీనివాసరావు, కెవిపిఎస్ నాయకులు దాసి బాలయ్య పాల్గొన్నారు.

దుర్గాదేవికి పసుపు కొమ్ములతో అలంకరణ



కోమటిగుంటలో దుర్గాదేవికి పసుపు కొమ్ములతో అలంకరించిన దృశ్యం

కాళ్ల: కాళ్ల మండలం కోమటిగుంటలో వేంచేసియున్న దుర్గాదేవి అమ్మవారు పసుపు కొమ్ముల అలంకరణలో శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. పుష్య మాసం దశమి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు సమర్పించిన లక్ష పసుపు కొమ్ములతో అలంకరించినట్లు ఆలయ అర్చకులు శ్రీనివాసుల పవన్ తెలిపారు. ఆలయ అనువంశిక ధర్మకర్త ఎరుబండి రామాంజనేయులు రత్నకుమారి దంపతులతో అమ్మవారికి విశేష కుంకుమ పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు అమ్మవారికి వెండి కిరీటాన్ని అందజేశారు. పైడిపర్రుకి చెందిన పెన్నాడ వెంకటసాయికుమార్, ప్రవల్లిక దంపతులు అమ్మవారికి వెండి గ్లాసును సమర్పించినట్లు ఆయన తెలిపారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, జనసేన జిల్లా అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావు, జనసేన ఉండి ఇన్‌చార్జి జుత్తుగ నాగరాజు తదితరులు అమ్మవారిని దర్శించుకునే ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో దాతలు సహకారంతో అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

ఆడపిల్ల దేశానికే గర్వకారణం



గొల్లవానితిప్ప హైస్కూల్లో బాలిక ఆవశ్యకతపై మాట్లాడుతున్న డీపీఎంఓ సీహెచ్ ధనలక్ష్మి

భీమవరం అర్బన్: ఆడపిల్ల దేశానికే గర్వకారణమని ఆడపిల్లను పుట్టనిద్దాం, బతకనిద్దాం, చదవనిద్దాం, ఎదగనిద్దాం అని డిస్ట్రిక్ ప్రోగ్రాం మానటరింగ్ ఆఫీసర్ సీహెచ్ ధనలక్ష్మి అన్నారు. భీమవరం మండలంలోని గొల్లవానితిప్పలో జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా భేటీ బచావో -బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ ఎ. అరుణరాణి, ఎమ్‌హెచ్ ఈవో అప్పారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దిరుసుమర్రులోని మండల పరిషత్ పాఠశాలలో..

ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 94,95,96,97 సెక్టార్ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఏఎన్ఎమ్‌లు డి. ఎవిల్య, ఎమ్ఎస్‌కే అనూష ఆధ్వర్యంలో బాలిక ఆవశ్యకతపై ర్యాలీ నిర్వహించారు. అంగన్ వాడీ వర్కర్స్ దయామణి, జ్యోతి, మీనాక్షి,కల్యాని పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం

కాళ్ల: జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లోని పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ర్యాలీ నిర్వహించారు. ప్రధానంగా కాళ్లకూరులో సర్పంచ్ సాధు శ్రీదేవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఐసీడీఎస్, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలికల బంగారు భవిష్యత్తును కాపాడాలి

భీమవరం (ప్రకాశంచౌక్): బాలికల బంగారు భవిష్యత్తును కాపాడవలసిన బాధ్యత మన అందరిపైన ఉందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా సోమవారం కలెక్టరేట్ చాంబర్‌లో కలెక్టర్ చదలవాడ నాగరాణి గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ బాలికల భద్రత, ఆరోగ్యం, విద్యపై అందరూ బాధ్యతగా మెలగాలన్నారు. ఈ సందర్భంగా గోడ పత్రికను ఆవిష్కరించారు. ప్రాజెక్టు డైరెక్టర్ బి.సుజాత రాణి, డిఈఓ నారాయణ, డీసీపీఓ ఆర్.రాజేష్, క్రాఫ్ జిల్లా కోఆర్డినేటర్ ఆర్. శ్రీనివాస రావు పాల్గొన్నారు.

ఆడపిల్లలను రక్షిద్దాం

పాలకోడేరు: ఆకివీడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ వాణి విజయరత్నం ఆదేశానుసారం పాలకోడేరు మండలంలోని మోగల్లు, విస్సాకోడేరు, పాలకోడేరులో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సూర్యకుమారి, పార్వతీ ఆధ్వర్యంలో జాతీయ బాలిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విమల, చంద్రకుమారి, దేవి, నాగలక్ష్మి, సుబ్బలక్ష్మి, జోత్స్న, మంగతాయారు పద్మ, రత్నమాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డపై వివక్ష తగదు

ఉండి: ఆడబిడ్డపై వివక్ష చూపిస్తే మనకు భవిష్యత్తరం ఉండదని ఉండి మండల వైద్యాధికారి డాక్టర్ బి.సాయిచంద్ర అన్నారు. జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని పెదపుల్లేరు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు వారి తల్లిదండ్రులతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఆర్ కృష్ణకుమార్, రవివర్మ, దయావతి, మరియమ్మ, స్కూల్ సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాలికలందరూ ఉన్నత విద్యనభ్యసించాలి



రాయకుదురులో బాలికల దినోత్సవ దృశ్యం

వీరవాసరం: బాలిక దినోత్సవం సందర్భంగా వీరవాసరం, రాయకుదురు, కొణితివాడ, మత్స్యపురి, అండలూరు జెడ్పీహెచ్ హైస్కూల్లో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సమావేశం నిర్వహించారు. బాలికల విద్య, మానసిక, శారీరక, మానసిక ఆరోగ్యం, వారికున్న హక్కులు, అవకాశాలను తెలియజేశారు. బాలికలందరూ చక్కగా చదువుకొని ఉన్నతమైన పదవుల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీహెచ్ఎస్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు జక్కంశెట్టి శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పీబీవీఎల్ సరోజిని, డి.గీత, సీహెచ్‌ఓ దేవదాసు, అంగన్‌వాడీ టీచర్లు నాగరత్నం, సత్యవతి, శాంతి కుమారి, నారాయణమ్మ, జెస్సీ రాణి, నాగమణి, విజయకుమారి, గంగాభవాని, మంగమ్మ, మహిళా సంరక్షణ కార్యదర్శి సీహెచ్ రవళి పాల్గొన్నారు.

చేనేత రంగానికి నిధులు కేటాయించాలి

భీమవరం: చేనేత వృత్తి పరిరక్షణకు ప్రభుత్వం నిధులు కేటాయించి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు, వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ జిల్లా కన్వీనర్ కనకం వరప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి భీమవరం కలెక్టరేట్‌లోని చేనేత జౌళి శాఖ కార్యాలయం వద్ద ధర్నా చేసి అనంతరం ఏడీ కొప్పర్తి అప్పారావుకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వీరభద్రరావు, వరప్రసాద్ మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ రంగం తరువాత చేనేత వృత్తి నేటికీ ప్రాముఖ్యత కలిగి ఉందని అన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చేనేత వృత్తిని దెబ్బతీసే విధానాలు అమలు చేస్తోందని విమర్శించారు. గతంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నేతన్న నేస్తం పథకాన్ని అమలు చేసి చేనేత కార్మికులను ఆదుకుందని అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేనేత రంగాన్ని చిన్నచూపు చూస్తోందని అన్నారు. జీఎస్టీని ఎత్తివేస్తామని లేని పక్షంలో రీయింబర్స్‌మెంట్ ఇస్తామని, చేనేత కార్మికులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అమలు చేస్తామన్న వాగ్దానాల అమలుకు బడ్జెట్లో చేనేతకు నిధులు కేటాయించకుండా కాలయాపన చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వం చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బూడిద జోగేశ్వరరావు, ఒగ్గు సత్యనారాయణ, కుర్మా పద్మావతి, రాపర్తి సత్యనారాయణ, మంచి దామోదరం, సందకర్ణ లావణ్య పాల్గొన్నారు.

పాఠశాలలో సామాజిక తనిఖీ

కాళ్ల: రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సామాజిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం కలవపూడి హైస్కూల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమక్షంలో సమావేశం నిర్వహించారు. దీనిలో పలు విషయాలను పర్యవేక్షించి, నివేదిక సమర్పించారు. పాఠశాల ఆవరణలో పరిశుభ్రత, తరగతి గదులు, బాలుర, బాలికల టాయిలెట్లు, క్రీడామైదానం, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ, ఉపాధ్యాయుల పని తీరు, పాఠశాల రికార్డులు, విద్యార్థుల సమస్యలు లాంటి పలు అంశాలపై తగిన సలహాలు, సూచనలు అందించినట్లు ప్రధానోపాధ్యాయుడు జె.సీతారామమూర్తి తెలిపారు. ఈ సామాజిక తనిఖీకి రిసోర్స్ పర్సన్‌గా వెంకటేష్, ప్రభాకర్ వ్యవహరించారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల పేరెంట్స్ కమిటీచైర్మన్ జి.హెచ్.ప్రియాంక, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాడి రైతులు మెలకువలు పాటించాలి



కుప్పనపూడిలో పశువైద్య శిబిరం

ఆకివీడు: పాడి రైతులు మెలకువలు పాటించి పశువుల ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు శ్రద్ధ తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు జి.మల్లేశ్వరరావు సూచించారు. మండలంలోని కుప్పనపూడిలో శుక్రవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు నట్టల నివారణ చర్యలు చేపట్టాలన్నారు. పశువులు అనారోగ్యానికి గురికాకుండా ముందుజాగ్రత్త చర్యలుగా ప్రతి మూడు నెలలకొకసారి మందులు వేయాలని సూచించారు. మండల వ్యసాయాధికారిణి కెల్లా భార్గవీ సత్య మాట్లాడుతూ వైద్య శిబిరాల్ని అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్నామని, పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శనివారం అజ్జమూరు, చినమిల్లిపాడులో వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముత్యాల అనురాధ, పాడి రైతులు పాల్గొన్నారు.

సర్పంచ్ భర్త తీరును నిరసిస్తూ వార్డు సభ్యుల ధర్నా

పాలకోడేరు: సర్పంచ్ భర్త అనధికారికంగా పెత్తనం చెలాయిస్తూ, పంచాయతీ కార్యదర్శితో కలిసి అవినీతికి పాల్పడుతున్నారంటూ పాలకోడేరు పంచాయతీకి చెందిన వార్డు సభ్యులు ఆరోపించారు. ఈ మేరకు వారు విచారణ చేయాలంటూ గురువారం నిరసనకు దిగారు. పాలకోడేరు సర్పంచ్ ఇంజేటి మరియమ్మ భర్త లక్ష్మీపతి అనధికారికంగా పెత్తనం చెలాయిస్తూ, ప్రతి పనికీ లంచాలు గుంజుతున్నారని వార్డు సభ్యులు ఆరోపించారు. వార్డు సభ్యులకు తెలియకుండా సర్పంచ్, భర్త కార్యదర్శి తీర్మానాలు చేసి పనులు చేపట్టి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పాలకోడేరుకు పెట్రోల్ బంక్ మంజూరు అంశంలో వార్డు సభ్యులకు తెలియకుండా ఎలా తీర్మానం చేశారని దుయ్యబట్టారు. పాలకోడేరు పంచాయతీలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై కలెక్టర్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆళ్ల నాగేశ్వరరావు, దెందుకూరి వెంకటరాజు, గాదిరాజు రఘు, కలిదిండి సూర్యకుమారి, ఆళ్ల అప్పలరాజు, ఓంకార్, కళ్యాణ్ పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌కేఆర్‌లో 4న కోడింగ్ కాంపిటీషన్

భీమవరం: భీమవరం ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఫిబ్రవరి 4న కోడింగ్ కాంపిటీషన్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ కేవీ మురళీకృష్ణంరాజు చెప్పారు. శుక్రవారం పోటీల పోస్టర్‌ను కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు విడుదల చేశారు. అనంతరం జగపతిరాజు మాట్లాడుతూ కోడింగ్ కాంపిటీషన్ రెండు విభాగాలుగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోడింగ్ క్లబ్ కన్వీనర్ కె డేవిడ్ రాజు, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ హెడ్ బీహెచ్‌వీ ఎస్ రామకృష్ణంరాజు, ప్లేస్మెంట్ సెల్ డీన్ కేఆర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

చదరంగంలో ఉచిత శిక్షణ

వీరవాసరం: చదరంగం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి పెంపొందుతుందని జిల్లా చదరంగం సంఘ అధ్యక్షుడు మాదాసు కిషోర్ తెలిపారు. దూసనపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు చదరంగంలో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదరంగం ద్వారా విద్యార్థుల్లో మానసిక ధైర్యం, ఆలోచన శక్తి, సుసంపన్నమైన జ్ఞానం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు యు బంగారు బాబు, ఎన్. మహేష్, కె. శ్రీనివాస్, బి.కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జననాయక్ కర్పూరి ఠాగూర్‌కు ఘన నివాళి

వీరవాసరం: బీహార్ మాజీ ముఖ్యమంత్రి, భారతరత్న, నాయీ బ్రాహ్మణ ముద్దుబిడ్డ, జననాయక్ కర్పూరి ఠాగూర్ శత జయంతి సందర్భంగా మత్స్యపురిలో జిల్లా నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు కొడవర్తి శివప్రసాద్ ముఖ్యఅతిథిగా, భీమవరం రూరల్ నాయి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో, మత్స్యపురి నాయి బ్రాహ్మణ సంఘ సభ్యులు అధ్యక్షతన వేడుకలు ఘనంగా శుక్రవారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కొడవర్తి శివప్రసాద్ మాట్లాడుతూ, ఆయన చరిత్రను వివరిస్తూ, కర్పూరి ఠాగూర్‌కు భారతరత్న రావడం అనేది యావత్తు నాయి బ్రాహ్మణ సమాజానికి గర్వకారణమని అన్నారు. సామాన్య నాయీ బ్రాహ్మణ కుటుంబం నుంచి వచ్చి ఎమ్మెల్యే, మంత్రి, రెండు సార్లు ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టడం సామాన్యమైన విషయం కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో దిగమర్తి వెంకటేశ్వరరావు, దిగమర్తి రాము, దిగమర్తి దుర్గేష్, దిగమర్తి శ్రీనివాస్, కొడవర్తి ధనరాజ్, అమలాపురం మధు, మహిళలు పాల్గొన్నారు.

వ్యాధుల వ్యాప్తిపై సర్వే

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని గూట్లపాడులో శుక్రవారం ఏఎన్ఎమ్‌లు, వైద్య సిబ్బంది అసంక్రమిత వ్యాధుల సర్వేపై డిస్ట్రిక్ ప్రోగ్రాం మానిటరింగ్ ఆఫీసర్ సీహెచ్ ధనలక్ష్మి క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. అసంక్రమిత వ్యాధులైన రొమ్ము, నోరు, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్లపై గతేడాది నవంబర్ 14న సర్వే ప్రారంభమైంది. ఏఎన్ఎమ్‌లు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి వ్యాధుల వివరాలను మొబైల్ యాప్‌లో వివరాలు అప్‌లోడ్ చేస్తున్నారు. డీపీఎమ్‌వో సీహెచ్ ధనలక్ష్మి వెంట వైద్యాధికారిని ఎ అరుణ రాణి, ఎమ్‌పీహెచ్‌ఈవో అప్పారావు, ఆరోగ్య సూపర్ వైజర్, ఏఎన్ఎమ్‌లు, ఆశా వర్కర్లు ఉన్నారు.